# టామీ

తెలిదేవర భానుమూర్తి



ఆ రోజు సాయంత్రం కాలేజీనుంచి వచ్చేటప్పుడు మా అమ్మాయి ఒంటరిగా రాలేదు. ముద్దొచ్చే ఓ తెల్లటి కుక్కపిల్లను వెంటబెట్టుకొని వచ్చింది.

"ఈ కుక్కపిల్ల నీకెక్కడ దొరికిందే?"అని అడిగితే-

"నా క్లాస్‌మేట్‌వాళ్ల పెంపుడు కుక్క మూడు పిల్లల్ని పెట్టింది. వాటిలో ఒక దాన్ని తీసుకొచ్చాను. ఎప్పటి నుంచో కుక్కను పెంచుకుందామనుకుంటున్నాం గదా" అని మా అమ్మాయి అంది.

అనడమే కాకుండా కుక్కపిల్ల సంరక్షణ భారాన్నంతా తనమీదే వేసుకుంటానని మాటకూడా ఇచ్చింది. బజారు కెళ్లి కుక్క మెడలో కట్టడానికి ఒక నల్లటి బెల్టూ, ఓ గొలుసూ, దానికి పెట్టడానికి కుక్క బిస్కట్లూ కొనుక్కొచ్చింది. ఆ పూట కుక్కపిల్లకు పాలు పట్టింది. ఆడుకోవడానికి కుక్కపిల్ల దొరికినందుకు మా చిన్న వెధవ బోల్డెంత సంతోషించాడు. దానితో ఆడ్డం మొదలుపెట్టాడు.అది కూడా కొత్తచేయకుండా వాడితో ఆడ్డం మొదలెట్టింది. కుక్కపిల్ల వచ్చాక మా అమ్మాయికి తీరిక లేకుండా పోయింది. పొద్దున్న లేవగానే మా అమ్మాయి కుక్కపిల్లను షికారుకు తీసుకెళ్లేది. షికారు నుంచి వచ్చాక శుభ్రంగా కడిగి మరీ దానికి స్నానం పోసేది. స్నానం తరువాత బిస్కట్లు పెట్టేది. పాలు పోసేది. తోకాడిస్తూ అది బిస్కట్లుతినేది. మొదట దాన్ని మాఇంటి ఆవరణలో ఉన్న జామచెట్టుకు కట్టేశాం. చెట్టుకు కట్టేస్తే అది అటూఇటూ గింజుకుంది. ఆగకుండా భౌభౌమంటూ గొలుసుతీసేదాకా మొరిగింది. దాని బాధపడలేక మా అమ్మాయి గొలుసు కాస్తా తీసింది. గొలుసు తీయగానే అది ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఇంట్లోకి పరిగెత్తుకు వచ్చి సోఫా కింద దూరింది. కుక్కపిల్లకు మా అమ్మాయి టామీ అని పేరు పెట్టింది. టామీ అని పిలవగానే ఎక్కడున్నా అది పరిగెత్తుకు వచ్చేది. తోకాడిస్తూ మీదపడేది. రెండునెలల్లో టామీ పెరిగి పెద్దదైంది. దాని మొరుగుడులో కూడా మార్పువచ్చింది. కొత్తవారెవరైనా మా ఇంటికి వస్తేచాలు అది మొరిగేది. వాళ్లమీదికి ఉరికేది. గేటు చప్పుడైతే చాలు భౌభౌ మనేది. అది మొరగగానే ఎవరోవచ్చారని గ్రహించి దాన్ని కట్టేసేవాళ్లం.ఇంతా చేస్తే మా టామీ జాతికుక్క కాదు. జాతి కుక్క కాకున్నా కొత్తవాళ్లను హడలగొట్టేది.

టామీఅంటే మా ఇంట్లో ఒక్క మా నాన్నగారికి తప్ప అందరికీ ఇష్టమే.ఆయన మా ఊర్లో వ్యవసాయం చేస్తున్నారు. ఆయన్ని ఓసారి కుక్క కరించింది. బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు తీసుకోవాల్సి వచ్చి ఆయన బాధ పడ్డారు. మా అమ్మ ఈ లోకంలో లేకపోవడంతో ఆయనకు ధైర్యంచెప్పేవారే కరువయ్యారు. చదువు పూర్తి కాకపోవడంతో నేను కూడా ఆయన దగ్గర ఉండలేకపోయాను.ఆయన కనిపించినా టామీ తోక ఊపేది. అది ఎప్పుడు భౌమన్నా ఆయన-

"ఛీ!ఛీ! పాడుకుక్క. గది దప్పిచ్చి ఇంకోటి దొర్కని తీర్గ ఎందుకు బట్టుకొచ్చింద్రో" అంటూ కోపగించేవారు.

ఆయన అంతరంగం టామీకి తెలుసు కాబోలు, పొరపాటునకూడా అది ఆయన దగ్గరికి వెళ్లేదికాదు. మా అమ్మాయి దగ్గర టామీ గారాలుపోయేది.దానికి మా అమ్మాయి బంతాట నేర్పించింది. బంతిని దూరంగా విసిరేస్తే అది పరిగెత్తుకెళ్లి దాన్ని నోట కరుచుకొని వచ్చేది. ఉడికించిన గుడ్డును అన్నంలో కలిపిపెడితే అది ఆప్యాయంగా తినేది. మేము శాఖాహారులమైనప్పటికీ దానికోసం వారంవారం మాంసం కొనేవాళ్లం.మా నాన్నగారు చూడకుండా దానికి పెట్టేవాళ్లం. పశువైద్యశాలకు తీసుకెళ్లి దానికి యాంటీరాబిస్ ఇంజక్షన్ కూడా ఇప్పించాం.టామీ మా కుటుంబ సభ్యుల్లో తానూ ఒకటైపోయింది.

నాకు హైదరాబాద్‌కు బదిలీ అయ్యింది. టామీని ఏం చేద్దామా అని ఆలోచించాను. దాన్ని ఆ ఊళ్లోనే వదిలి పెడదామనుకున్నాను. కానీ అందుకు మా అమ్మాయి ఒప్పుకోలేదు. తన మాట నెగ్గించుకోవడానికి ఆమె రెండ్రోజులు అన్నం తినడం మానేసింది. గత్యంతరం లేక మాతోపాటు టామీని కూడా తీసుకెళ్లాలని నిశ్చయించాం. ఎంతలా చెప్పినా మా నాన్నగారు మాతో రానన్నారు. ఆ ఊర్లోనే ఉండిపోతానన్నారు. నేను కూడా మాతో రమ్మని ఆయన్ని బలవంతం చేయలేదు.

"ఒక్కనివి గీ ఊర్లె ఎట్లుంటవు నాయినా?" అని అడిగితె-

"పుట్టెటప్పుడు ఒక్కన్నే బుట్టిన. సచ్చేటప్పుడు ఒక్కన్నే సస్త. పట్నంల నాకు చైన్‌బట్టదు.గీడ ఉన్నోల్లంత పాతోల్లే గదా. ఎవలో ఒకలు ఒస్తనే ఉంటరు. మంచిచెడ్డలు అర్సుకుంటనే ఉంటరు. గాడేంఉన్నది. పట్నమంత పైనపటారం. లోపట లొటారం"అని ఆయన అన్నారు.

గత్యంతరం లేక ఆయన లేకుండానే మేము హైదరాబాద్ వెళ్లేం. కొత్తప్రదేశమని టామీ కొత్తేంచేయలేదు. యథాప్రకారం తోకాడిస్తునే ఉంది. భౌభౌమంటూనే ఉంది. కానీ ఆ చుట్టుపక్కల వాళ్లు మాత్రం మమ్మల్ని ఊరకుక్క ఉన్నవాళ్లు అనేవారు.ఆ వీధిలో చాలా మంది ఇళ్లలో జాతి కుక్కలుండేవి. జాతికుక్కలను వెంటబెట్టుకొని మార్నింగ్‌వాక్‌కు వెళ్లేవారే అక్కడ ఎక్కువ. పట్నం వచ్చాక మా అమ్మాయి పొద్దుటి పూట టామీని షికారుకు తీసుకెళ్లడం మానేసింది.

ఆ చుట్టుపక్కల వాళ్లు మాత్రం మమ్మల్ని ఊరకుక్క ఉన్నవాళ్లు అనేవారు.ఆ వీధిలో చాలా మంది ఇళ్లలో జాతి కుక్కలుండేవి

తక్కిన వాళ్ల జాతికుక్కలను వెంటబెట్టుకొని వెళుతుంటే ఊరకుక్కతో వెళ్లడానికి తను నామోషీపడింది. పొద్దుటిపూట షికారుకు తీసుకెళ్లకపోయినా టామీ గొడవ చెయ్యలేదు. గొలుసు ఊడదీస్తే అదే అటూ ఇటూ తిరిగి వచ్చేది.

ఈ మధ్య టామీ మునపటంత ఉషారుగా ఉండటం లేదు. ఏమైందేమో కాని దాని చెవినుంచి చీము కారడం ప్రారంభించింది. దాంతో మాటిమాటికీ అది తన తల విదిలేంచేది. దాన్ని డాక్టర్‌వద్దకు తీసుకెళుతుంటే అందరూ విచిత్రంగా మాకేసి చూశారు. పట్నవాసులు చూసిన చూపులకు మా అమ్మాయి ఇబ్బంది పడింది. డాక్టర్ ఏవో మందులు రాసిచ్చాడు. చెవిలో మందు వేయడంతో టామీకి చీముకారడం తగ్గింది. కానీ దురద పోనట్టుంది. పదేపదే అది చెవు గోక్కునేది. ఎంతలా గోక్కునేది అంటే ఒక్కోసారి రక్తంకారేది. మా అమ్మాయి చూడలేక చన్నీళ్లతో దానికి స్నానం చేయించి పౌడర్ చల్లేది. ఊరికే గోకడం మూలంగా కాబోలు టామీ చెవంతా వాచింది. మునపటిలా అది అన్నం తినలేక పోతున్నది. మునపటిలా మొరగలేకపోతున్నది. మమ్మల్ని చూసినపుడు తోకాడిస్తున్నది కానీ మా మీద పడటంలేదు. ఓ మూలనలా పడుకుంటున్నది. ఉన్నచోట ఉండకుండా అనవసరంగా కుక్కను పెంచామే అని చింతించాను.


రెండ్రోజులనుంచీ టామీ అసలన్నం ముట్టలేదు.

"అమ్మా! టామీని ఒకసారి డాక్టర్ వద్దకు తీసుకెళ్లగాదా" అని మా అమ్మాయితో అన్నాను.

"దాన్ని తీసుకెళుతుంటే అందరూ విచిత్రంగా చూస్తున్నారు. గాంవ్ కే ఖేడే. జంగల్‌సే అయే అంటూ కామెంట్‌చేస్తున్నారు. నువ్వే తీసుకెళ్లు నాన్నా!" అని మా అమ్మాయి అన్నది.

మా ఆఫీసులో ఇన్స్‌పెక్షన్ జరుగుతుండటం మూలంగా వెంటనే నేను టామీని డాక్టర్ వద్దకు తీసుకెళ్లలేకపోయాను.

ఆ రోజు పొద్దున్న ఎప్పటిలా టామీ లేవలేదు. నన్ను చూసినప్పటికీ తోకాడించ లేదు. దాని కళ్లు వాలిపోతున్నాయి. ఆలస్యంచేస్తే మంచిది కాదని ఆటోలో టామీని తీసుకొని డాక్టర్ వద్దకు వెళ్లాను.



డాక్టర్ పరీక్షిస్తుండగానే టామీ కన్నుమూసింది.

"మాస్టారూ! రెండ్రోజుల ముందు తీసుకొస్తే మీ కుక్క బతికేది"అని డాక్టర్ అన్నాడు.

ఆయనలా అనగానే నాగుండె బరువెక్కింది. కళ్లలో నీళ్లు తిరిగాయి. అదే ఆటోలో చలనరహితమైన టామీతో ఇంటికి తిరిగి వెళ్లాను. మా అమ్మాయి గేటువద్దే నిలుచునిఉంది. ఆటో ఆగగానే ఆత్రుతతో ఆమె పరిగెత్తుకొచ్చింది. చనిపోయిన టామీని చూసి మాఅమ్మాయి భోరుమని ఏడ్చింది. ఆరోజు ఆమె అన్నం తినలేదు. ఎవరితోనూ మాట్లాడలేదు. ఆఖరికి టి.వీలో తనకిష్టమైన సీరియల్ వస్తున్నా చూడలేదు. మా ఇంట్లో విషాదపు చీకట్లు అలుముకున్నాయి.

ఇప్పుడు నేను ఇంటికెళితే భౌభౌ మంటూ తోక ఊపే టామీలేదు. ఆప్యాయంగా మీద దూకే మూగజీవి లేదు. సోఫా కింద కూచుని కాళ్లకు అడ్డంపడే విశ్వాసపాత్రమైన జంతువు లేదు. కానీ మా నిర్లక్ష్యం వల్లే ఆ మూగజీవి ప్రాణాలు పోయాయనే గిల్టీ ఫీలింగ్‌మాత్రం మాలో ఉంది. టామీలాగే మా నాన్న కూడా అనే భావన మనసులో మెదలడంతో గుండె బరువెక్కింది. మా నాన్న మోటుగా ఉంటాడు. ముతక ధోతీ కట్టుకుంటాడు. తలపాగా చుట్టుకుంటాడు. చుట్ట కాలుస్తాడు. సగం కాల్చి చుట్టనార్పి ఆ చుట్టను తలపాగాలో పెట్టుకుంటాడు. యాసతో పెద్దగా మాట్లాడుతాడు. తనకేదైనా ఇష్టం లేకపోతే ఎదుటివాడితో పోట్లాటకు దిగుతాడు. నాతో పాటు రమ్మంటే రాలేదు. రాకపోతే మాత్రం బలవంతంగానైనా తీసుకురావాల్సింది. ఇందరమున్నా ఈ వయసులో చేతులు కాల్చుకుంటూ ఊర్లో ఉండే కర్మ ఆయనకేం పట్టింది. నిజానికి మా మనసులోనే మాలిన్యం ఉంది. సోకాల్డ్ నాగరికులుగా చలామణి అవుతున్న మేము ఆయన ఉనికిని భరించలేకపోయాము. ఆయనను మాతో పట్నానికి తీసుకు వస్తే సభ్య సమాజం మమ్మల్ని పక్కా ఊరిబైతులుగా జమకడుతుందని భయపడ్డాము. ఎవరో ఏదో అనుకుంటారని భావించడం వల్లే మేము టామీని పోగొట్టుకున్నాము. అదేవిధంగా మా నాన్నను కూడా పోగొట్టుకోదలుచుకోలేదు. ఆయనను పట్నం తీసుకురావడానికిగాను మా ఊరికి బయల్దేరాను. ●

## లావు తగ్గడానికి 'మలబార్ చింతపండు'

సర్వసాధారణంగా 'ఒబేసిటి' పదం ఆరోగ్య సంభాషణల్లో తరచుగా వినిపిస్తుంది. స్థూలకాయాన్ని తగ్గించుకోడానికి ఇప్పుడు అందరూ నానాపాట్లు పడుతున్నారు. లావు తగ్గడానికి, సన్నబడటానికి ఇప్పుడు పెద్దపెద్ద నగరాల నుంచి చిన్నచిన్న పట్టణాలవరకు 'స్లిమ్' సెంటర్‌లు వెలిశాయి. కానీ ప్రమాణాలు పాటించని కేంద్రాలతో సమస్యలు అధికమవుతాయి. ఆదుర్దా అనర్థాలకు దారితీస్తుంది. సహజమైన పద్ధతుల్ని పాటిస్తే లావుతగ్గడం సమస్య కాదు. మనకు అందుబాటులో ఉన్న అమూల్యమైన ఒషధుల్ని ఉపయోగించుకుంటే, స్వల్ప ఖర్చుతో ఎక్కువ ఫలితాల్ని పొందే వీలుంది. అటువంటి వాటిలో ముఖ్యమైంది శాస్త్రీయంగా సంస్కృతంలో పిలిచే వృక్షామ్లం. ఇంగ్లీషులో 'గార్సీనియా'గా పేర్కొనే 'మలబార్ చింతపండు' బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. మహారాష్ట్ర, దక్షిణాది గ్రామీణ ప్రాంతాల్లో వంటకాల్లో మామూలు చింతపండు బదులు మలబార్ చింతపండును ఉపయోగిస్తారు. పండిన పండు పులుసుకూరలో పచ్చళ్ళకు, రాత్రివేళ రసంలో విరివిగా ఉపయోగిస్తారు. గుజ్జును వేసవిలో శీతల పానీయాల్లో వాడుతారు.

విటమిన్ సి, మాలిక్ యాసిడ్, సిట్రిక్ యాసిడ్ గార్సీనియా పండ్లలో విరివిగా దొరుకుతుందని పరిశోధకులు తేల్చిచెప్పారు. అయితే గార్సీనియాలోని 'హైడ్రాక్సీ సిట్రిక్ ఆసిడ్' ఒబేసిటీ తగ్గించే ముఖ్యమైన గుణం కలిగి వుండటం విశేషమైన అంశం. ఈ హైడ్రాక్సీసిట్రిక్ ఆసిడ్ యువకుల్లో, యువతుల్లో పేరుకుపోయిన కొవ్వును కరిగిస్తుందని పరిశోధకులు నిర్ధారించారు. నిరపాయకరమైనది. అయితే పిల్లలు, గర్భిణీ స్త్రీలు దీన్ని వాడకూడదు. పరాన్నజీవులైన పేగుల్లోని క్రిములను పొగొట్టే విశేష గుణంతోపాటు రక్తప్రసరణానికి గుండె కండరాలకు ఇది ఉపయోగపడుతుంది. గార్సీనియాను నువ్వులనూనెతో నూనె తయారుచేసుకొని రోజు అభ్యంగం చేసుకుంటే చర్మం కాంతివంతంగా, నాజూకుగా తయారవుతుంది.

- డా. ధేనువకొండ శ్రీరామమూర్తి

## నిఘంటువు మూలం తెలుసా?

బహుభాషలు ఉన్న ఈ కాలంలో నిఘంటువుల అవసరం అందరికీ తెలిసిందే. అయితే నిఘంటువుల చరిత్రను ఎప్పుడయినా గమనించారా? క్రీ.శ. ఒకటో శతాబ్దంలో చైనీస్ భాషలో 'షువా-వెన్'. (మాటల్ని గురించిన ప్రస్తావన) అనే పేరుతో ఒక నిఘంటువు రూపొందింది.

రోమన్ సామ్రాజ్య కాలంలో లాటిన్ భాషలో నిఘంటువులు సంకలనం చేశారు. క్రీ.శ ఆరో శతాబ్దంలో అరబిక్ భాషలో పెద్ద నిఘంటువు తయారుచేశారు. సంస్కృత నిఘంటువులలో అత్యంత ప్రాచీనమైనది అమరసింహుడు రాసిన అమరకోశం. దీన్ని నాలుగో శతాబ్దంలో రాశారాయన. తెలుగు నిఘంటువులు పద్యరూపంలో పదిహేడో శతాబ్దంలో రచించారు. పదహారో శతాబ్దం నుంచి ప్రపంచంలోని ముఖ్యభాషల్లో నిఘంటువులు వెలువడుతున్నాయి. ఆంగ్లంలో 1750లో డా. శామ్యూల్ సంకలనం చేసిన సమగ్రమైన నిఘంటువు వెలువడింది.